క్లుప్తంగా

జాబు మేళా విజయవంతం



నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబు మేళా విజయవంతమైంది. హెటిరో్‌డ్రగ్స్, సుజల పైప్, ఎస్బీఐ లైఫ్, నవత ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు హాజరై 65 మందిని ఎంపిక చేసుకున్నారు. వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి నియామక పత్రాలు అందజేశారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

గోస్పాడు: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ సూచించారు. సాంబవరం ఆర్‌బీకే కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీఆర్ కార్డుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే గుర్తింపు కార్డు ఉండాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులపై 23న దీబగుంట్ల, సాంబవరం, 24న కానాలపల్లె, నెహ్రూనగర్, 25న పసురపాడు, గోస్పాడు, 26న ఎం.కృష్ణాపురం, జిల్లెల్ల, 27న జూలేపల్లె, ఒంటివెలగల, 29న యాళ్లూరు-1, యాళ్లూరు-2 గ్రామాల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

గ్రామాల వారీగా శిబిరాలు

శిరివెళ్ల: మండలంలో గ్రామాల వారీగా తేదీలు నిర్ణయించి శిబిరాలు ఏర్పాటు చేసి కౌలు రైతు గుర్తింపు కార్డులను జారీ చేస్తామని ఏఓ సుధాకర్ మంగళవారం తెలిపారు. 24న చెన్నూరు, గంగవరం, 25న గోవిందపల్లె, కోటపాడు, 26న శిరివెళ్ల, 27న యర్రగుంట్ల, 29న గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లె రైతు భరోసా కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించి దరఖాస్తులను పరిశీలించి కార్డులు అందజేస్తామన్నారు.

అక్రమ అడ్మిషన్లు అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు కోరారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు అక్రమ అడ్మిషన్లను అరికట్టి, ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మనోహర్, ఎర్రిస్వామి, రవితేజ, చరణ్, హుసేన్ పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పదోన్నతులతో ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో ఖాళీలన్నింటినీ కేటగిరీల వారీగా ప్రదర్శించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు మాన్యువల్‌గా నిర్వహించండి

నంద్యాల(న్యూటౌన్): పదోన్నతుల ప్రక్రియను మాన్యువల్‌గా నిర్వహించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదోన్నతుల్లో జనవరి నుంచి ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారావు, భాస్కరరెడ్డి, సుమయూన్, చెన్నుడు, జగదీష్, రహిమాన్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఆళ్లగడ్డ సీఐ

బొమ్మలసత్రం: ఆళ్లగడ్డ టౌన్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన రమేష్‌బాబు మంగళవారం జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో రమేష్‌బాబు వైఎస్సార్ జిల్లా బద్వేల్ సీఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ఆళ్లగడ్డ టౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో ఆళ్లగడ్డలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎస్పీని కలిశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

నంద్యాల టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం ఆయన మాట్లాడుతూ అధికారులు తరచూ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్లు అనురాధ, ఓ.లలిత, పీపీ తిరుపతిరావు, డీఐఓ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మాంసం.. మోసం!

- పొట్టేళ్ల చాటున గొర్రె, మేకల మాంసం విక్రయాలు
- ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- వీధివీధినా వెలుస్తున్న మాంసం విక్రయ కేంద్రాలు
- జాడలేని జంతువధ శాల పర్యవేక్షణ కమిటీ సభ్యులు
- తూకాల్లోనూ దగా.. పట్టించుకోని అధికారులు



అమ్మకానికి ఉంచిన మటన్

నంద్యాల(అర్బన్): మరికొన్నాళ్లు గడిస్తే పొట్టేళ్ల మాంసం కొనలేని, తినలేని పరిస్థితి వస్తుంది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఇప్పటికే మాంసం ధరలు షాక్ కొడుతున్నాయి. దీనికి తోడు మాంసం విక్రయిస్తున్న పలు ప్రాంతాల్లో పొట్టేలిదో, గొర్రెదో, మేకదో అనారోగ్యంతో ఉన్న మరియే జంతువుదో తెలియని పరిస్థితి. జిల్లాలో దాదాపు 920 ప్రాంతాల్లో పొట్టేళ్ల మాంసం విక్రయ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. చనిపోయిన వాటిని సైతం విక్రయానికి వినియోగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ, జిల్లా కేంద్రాల్లో ధరలు ఏకంగా 25 నుంచి 35శాతం ఎక్కువ. ఇక్కడి వ్యాపారులు సిండికేట్‌గా మారి అడ్డగోలుగా ధరలు పెంచుతూ అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కిలో రూ.800 పైమాటే..

జిల్లా కేంద్రంలో కిలో మాంసం రూ.800కు పైగా అమ్మకాలు జరుపుతుండగా పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.750 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. ఇక మండల, గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.600 నుంచి రూ.650 మాత్రమే విక్రయిస్తున్నారు. దుకాణాల వద్ద వినియోగదారులకు కనిపించేలా పొట్టేలు తల, గెట్టెలు, వృషణాలు(వట్టలు) ఎదురుగా వేళాడదీసి గొర్రె, మేకల మాంసం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మాంసానికి వినియోగిస్తున్న జీవం ఏదైనా ఆరోగ్యంగా ఉందా లేదా అని పశుసంవర్ధక శాఖ వైద్యులు పరీక్షించాలి. లేకపోతే బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ వంటి వ్యాధుల బారిన పడిన జీవాల మాంసాన్ని తింటే ఆ వ్యాధులు మనుషులకు సంక్రమించే ప్రమాదం ఉంది. జీవాన్ని పరీక్షించిన తర్వాతనే విక్రయించాలనే నిబంధన ఉన్నా జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాల్లో ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న కమేళాలో జీవాలను జవ చేయాల్సి ఉంది. అక్కడ పశువైద్యుడు జీవాల ఆరోగ్యం పరీక్షించిన తర్వాత జవ చేయాలి. విక్రయదారులు అవేవీ పట్టించుకోకపోవడంతో మాంసం విక్రయ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా మాంసం విక్రయాలు జరుగుతున్నాయి.

పట్టని మాంసం ధరల నియంత్రణ

మాంసం ధరల నియంత్రణకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఉంటుంది. ఇందులో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారి సభ్యులుగా ఉంటారు. కమిటీ సభ్యుల ఉదాసీన వైఖరితో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుకుంటూ పోతున్నారనే విమర్శలున్నాయి. దీంతో పాటు ప్రతి మూడు నెలలకోసారి జంతు వధ శాల పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగాల్సి ఉంది. అలాంటి సమావేశాలు జరగకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది.

అడ్డదారుల్లో వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

5 పొట్టేళ్లకు ఒక గొర్రె ఉచితం..

ప్రతి బుధవారం పట్టణ సమీపంలోని రాణి మహారాణి థియేటర్ వద్ద గొర్రెలు, మేకల విక్రయాల సంత జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచి తెచ్చిన జీవాల క్రయవిక్రయాలు జరుగుతాయి. మాంసం విక్రయదారులు ఐదు పొట్టేళ్లను కొంటే ఒక గొర్రె ఉచితంగా ఇవ్వడం ఇక్కడ ఆనవాయితీగా వస్తున్నట్లు సమాచారం. పొట్టేళ్ల విక్రయాల్లో భాగంగా పలువురు వ్యాపారులు గొడ్డు గొర్రెలు, రోగాల బారిన పడిన గొర్రెలు, మేకలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి పొట్టేలు మాంసం కలిపి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

కిలో రూ.50తో కొనుగోలు చేసేవాళ్లం



30 ఏళ్ల క్రితం పట్టణంలో కిలో పొట్టేలు మాంసం రూ.50తో కొనుగోలు చేసేవాళ్లం. మాంసం తినేవారి సంఖ్య పెరుగుతుండటంతో కిలో రూ.100 నుంచి పెరుగుతూ రూ.800 చేరింది. రోజువారి కూలీ చేసే వారు వారంలో ఒక రోజు కిలో మాంసం అంత మొత్తం చెల్లించాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కడ లేని పొట్టేలు మాంసం ధరలు నంద్యాలలో ఉండటం బాధాకరం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– హుసేన్‌సా, నంద్యాల

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పొట్టేలు మాటున గొడ్డు గొర్రెలు, మేకల మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం ఉంది. నాణ్యమైన మాంసం వినియోగదారులకు అందడం లేదు. విక్రయదారులు స్వలాభాల కోసం అమ్మకాల్లో అడ్డదారులు తొక్కుతున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కిలో రూ.800 అమ్మకాలు జరుపుగుతున్న పొట్టేళ్ల మాంసంలో నాణ్యత ప్రమాణాలు ఉండాలని సీపీఎం ఆధ్వర్యంలో పలు మార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.

– నరసింహ, సీపీఎం నాయకులు, నంద్యాల

తనిఖీలు నిర్వహిస్తాం



నేను బాధ్యతలు చేపట్టి ఆరు నెలలే అయ్యింది. ఇకపై తరచూ తనిఖీలు చేస్తాం. అనారోగ్యాల పాలైన జీవాల మాసాన్ని విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయించడం, అధిక ధరలకు విక్రయించడం నేరం. అలాంటి వ్యాపారులపై ప్రజలు కూడా ఫిర్యాదు చేయొచ్చు. విచారించి చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీ నిబంధనల మేరకే మాంసాన్ని విక్రయించాలి.

– డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్‌ఓ, నంద్యాల

కౌలుకార్డుపై అవగాహన

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల రైతు భరోసా కేంద్రంలో మంగళవారం కౌలుకార్డుపై మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. కౌలు కార్డు భూయజమాని, సాగుదారునికి మధ్య ఒప్పంద పత్రమే అని, దీని కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. కార్డులో భూయజమాని, సాగుదా రు పేర్లు, సర్వే నంబర్,విస్తీర్ణం ఉంటుందన్నారు. దీనివల్ల భూయజమాన్య హక్కులకు ఎటువంటి భంగం కలగదన్నారు. దీనివల్ల కౌలురైతులకు పంటలబీమా, విత్తనాలు, ఎరువులు, పంటనష్ట పరిహా రం, వైఎస్సార్ రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు మాత్రమే కౌలు రైతుకు వర్తిస్తాయన్నారు.

కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో మంగళవారం తిరుపతి తిరుమల దేవస్థానాల జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి హిందూ ధర్మ ప్రచార కరపత్రాలను విడుదల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందుత్వం అంటే విశ్వ జనీన హృదయమన్నారు. ఏ మతం పట్ల, ఏ ఆచార వ్యవహారాల పట్ల ద్వేశ భావం లేనిదని, ఈ సంస్కృతి మూలాల్లో ఉన్నదని తెలిపారు. నెహ్రూనగర్ గ్రామంలోని శ్రీరామాలయంలో ధార్మిక కార్యక్రమాల సందర్భంగా ప్రారంభోపన్యాసం చేశారు. దృష్టిలోని సమస్తమైన జీవరాశిలో అంతర్యామిగా భగవంతుడున్నారన్నారు. శ్రీమద్రామాయణంపై దోనెపూడి నరేష్‌బాబు చేసిన ప్రవచనం ఆద్యంతం అలరించింది.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఈఓ సుబ్బారెడ్డి

నంద్యాల(అర్బన్): జగనన్న లేఅవుట్లలో నిర్మాణ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నంద్యాల మండల గ్రామాల్లో చేపడుతున్న జగనన్న లేఅవుట్ల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పెద్దకొట్టాల, మిట్నాల, కానాల, పుసులూరు, చాపిరేవుల, ఊడుమాల్పురం గ్రామాల జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణలు జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో ఇంటి నిర్మాణాలు పూర్తికాకపోతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ భాస్కర్, ఏఈలు నాయక్, వర్మ, మహేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్ ఇవ్వాలని వినతి



డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

నంద్యాల టౌన్: డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాలని మంగళవారం ఏపీఎంసీఏ అసోసియేషన్ నాయకులు డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎంసీఏ అసోసియేషన్ నాయకులు సుజాత, దివ్యశ్రీ, భాస్కర్, గురుప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ రామచంద్రారావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావులు కోరారు. ఏపీ జేఏసీ అమరావతి మూడవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం ఉద్యోగుల ఆవేదనను చెబుదాం కార్యక్రమంలో భాగంగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలన్నారు. 11వ పీఆర్సీ కమీషన్ రెకమెండ్ చేసిన పేస్కేల్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రామసంజీవరావు, విజయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: పర్యావరణ పరిరక్షణపై హరినగరం గ్రామంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. పర్యావరణ హిత జీవనశైలిపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని, సుస్థిర ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. అటవీ సమీపంలో నివసిస్తున్నందున గ్రామంల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు



కేక్ తినిపించుకుంటున్న కార్యకర్తలు

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక డాక్టర్ గిరినాథ్ సర్కిల్‌లో పార్టీ నాయకులకు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ సన్న సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం



వెలుగోడు: పట్టణంలోని దాసరి వీధిలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. వృద్ధురాలు జనాబీ నిద్రిస్తున్న సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో ఇరుగు పొరుగు వారు వెంటనే ఆమెను కాపాడారు. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.40 వేల ఆస్తినష్టం సంభవించి ఉండవచ్చని అంచనా. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

హామీలన్నీ నెరవేర్చిన నాయకుడు జగనన్న

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



స్థానికుడికి ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం మండల కేంద్రంలోని 2, 3వ సచివాలయ పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామన్నారు. నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. యువగళం యాత్రలో లోకేష్ ఏమి చేస్తారో చెప్పకుండా ఎమ్మెల్యేలను, ముఖ్యమంత్రిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని నామరూపాల్లేకుండా చేస్తారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ దిల్షాద్ నాయక్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, వీరారెడ్డిపల్లె సర్పంచు మందాల శివారెడ్డి, నాయకులు ముడిమేల నాగరాజు, ముల్లా అన్వర్‌బాషా, దొర్నిపాటి రఫీ, ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ జ్యోతి

రుద్రవరం: జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి మంగళవారం సూచించారు. అలాగే కౌలు రైతులు రెవెన్యూ అధికారుల వద్ద సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి కౌలు కార్డులు పొందాలన్నారు.

హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు

నంద్యాల టౌన్: హజ్‌కు వెళ్లే యాత్రికులకు మంగళవారం స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో నేషనల్ విద్యాసంస్థల అధినేత ఇంతియాజ్ అహమ్మద్, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రభావతి, డాక్టర్లు చంద్రశేఖర్, ప్రసన్నలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మల్లన్న సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



మల్లన్న దర్శనార్థం వెళ్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వరరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు మంగళవారం వేకువజామున దర్శించుకున్నారు.వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

నేరాల కట్టడికి కృషి చేయాలి

బొమ్మలసత్రం: నేరాల కట్టడికి పోలీస్ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆత్మకూరు సబ్‌డివిజన్ అధికారులను పెండింగ్ కేసుల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం, సుండిపెంట పరిధిలో ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేయాలన్నారు. మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. లోన్ యాప్, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీఐలు దస్తగిరిబాబు, జయరాములు, ఎస్ఐలు అశోక్, రమేష్‌బాబు ఉన్నారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

సంజామల: వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని రెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గామానికి చెందిన చాకలి గురువిష్ణుతో నంద్యాల తెలుగుపేట మహిళ జ్యోతికి మూడు నెలల కిందట వివాహమైంది. ఇదిలా ఉండగా గత శనివారం ఊళ్లో జరిగిన ఓ మెరమని కార్యక్రమంలో పూల పాషావలి అనే వ్యక్తి జ్యోతితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తన భర్తకు చెబుతానని హెచ్చరించడంతో నిందితుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడగా తాను తప్పించుకుని బయటకు వచ్చింది. విషయాన్ని భర్తకు వివరించిన జ్యోతి మంగళవారం పోలీస్‌స్టేషన్‌ని ఆశ్రయించింది. ఈ మేరకు పూల పాషావలిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. అయితే తనతో మాట్లాడని పిలిపించి తనపై జ్యోతి భర్త గురువిష్ణు దాడికి పాల్పడ్డాడని పాషావలి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు గురువిష్ణుపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.